

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 17-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :121 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

రాహుల్‌పై ఆరోపణలు.. సుప్రీం కీలక వ్యాఖ్యలు!



రాహుల్‌పై ఆరోపణలపై సుప్రీం స్పందన

గర్భిణి జర్నలిస్టును నెట్టివేశారని ఆరోపణలు

మౌఖిక ఆరోపణలను పరిగణనలోకి తీసుకోలేము

ఆధారాలతో పిటిషన్ దాఖలు చేయాలని సూచన

బీజేపీ నేత గౌరవ్ భాటియా ప్రస్తావన

ర్యాలీ సందర్భంగా తోపులాటపై వివాదం

2 లో

డీలిమిటేషన్‌పై కేంద్రం ఫోకస్!

పార్లమెంట్‌కు ప్రత్యేక సెషన్?

మహిళా రిజర్వేషన్‌పై మళ్లీ ఫోకస్

బిల్లుల కోసం కేంద్రం కొత్త ప్లాన్

ప్రత్యేక సమావేశాలకు రంగం సిద్ధం?

రాజ్యాంగ సవరణ బిల్లులపై కదలిక

బిల్లుల ఆమోదానికి కేంద్రం వ్యూహం

ఈ నెలాఖరులో పార్లమెంట్ భేటీ?

మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఉత్కంఠ



న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలను తీవ్రతరం చేస్తున్న వేళ.. కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసుకోవడానికి అవసరమైన బలం తమకు ఉందని కేంద్ర ప్రభుత్వ అగ్రశ్రేణి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సభలో తమకు పూర్తి బలం ఉందనే నమ్మకంతో ఉన్న ప్రభుత్వం.. ఈ ప్రతిపాదిత చట్టాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో, ఓటింగ్ జరిగే అవకాశం ఉండటంతో తమకు మద్దతును మరింత పెంచుకునేందుకు ప్రతిపక్ష పార్టీలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

గతంలో ఏప్రిల్ 17న ముగిసిన బడ్జెట్ సమావేశాల సమయంలో మోడీ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు దిగువ సభలో వీగిపోయింది.

2 లో

ఎన్‌డీఎంసీ ఆంక్షలపై సుప్రీం హెచ్చరిక!

వ్యాపారులకు నష్టం జరిగితే ఊరుకోం

కనాట్ ప్లేస్ మూసివేతపై సుప్రీం ఆగ్రహం

అక్రమ నష్టంపై పరిహారం చెల్లించేలా చర్యలు

రోజుకు రూ.200 కోట్ల వ్యాపార నష్టం?

పండుగ వేళ దుకాణాల మూసివేతపై ఆందోళన

చిన్న వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం

ఎన్‌డీఎంసీ ఆంక్షలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

అక్టోబర్ 26కు తదుపరి విచారణ వాయిదా

2 లో

ధ్రువ్ రాఠీపై క్రిమినల్ కేసు!

ఇంటి గేటుపై కోర్టు సమన్లు

బీజేపీ ఐటీ సెల్ సభ్యుడి ఫిర్యాదు

2018 వీడియోతో మొదలైన వివాదం

రూ.50 లక్షల ఆరోపణలపై కేసు

2019 నుంచి అందని కోర్టు నోటీసులు

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నట్లు సమాచారం

అక్టోబర్ 17న తదుపరి విచారణ





2 లో

న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి పరువు నష్టం కేసులో ఇబ్బందులు మరింత పెరిగాయి. గురుగ్రామ్‌లోని ఇంటి ప్రధాన గేటుపై ఢిల్లీ సాకేత్ కోర్టు సమన్లను అంటించారు. బీజేపీ ఐటీ సెల్ సభ్యుడు వికాస్ సాకృత్యాయన్ అలియాస్ వికాస్ పాండే దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసుకు సంబంధించి ఈ పరిణామం చోటుచేసుకుంది. గురుగ్రామ్‌లోని సెక్టార్-56 లో ఉన్న కేంద్రీయ విహార్ సొసైటీలో ఉన్న ధ్రువ్ రాఠీ ఇంటి గేటుపై ఈ నోటీసును అతికించారు. కోర్టు సిబ్బందితో పాటు ఫిర్యాదుదారుడు స్వయంగా వెళ్లి ఈ సమన్లను జారీ చేసేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో అధికారులు ఈ చర్య తీసుకున్నారు. రాఠీకి నేరుగా అందజేయడానికి వీలుపడకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఇంటి గేటుపైనే ఈ నోటీసును అంటించి సమాచారం అందించారు.

పెట్రోల్‌పై పెంపు.. డీజిల్‌పై తగ్గింపు!

పెట్రోల్ ఎగుమతి సుంకం ఐదు రెట్లు పెంపు

డీజిల్ సుంకం సగానికి తగ్గింపు

అర్ధరాత్రి నుంచే కొత్త పన్నులు అమలు

పెట్రోల్‌పై లీటరుకు రూ.2.50 సుంకం

డీజిల్‌పై లీటరుకు రూ.8.50కి కోత

అంతర్జాతీయ ధరల ఆధారంగా సవరణలు

ప్రతి 15 రోజులకు పన్నుల సమీక్ష

2 లో

తలాక్‌పై కేంద్రానికి సుప్రీం నోటీసులు!

తలాక్ పద్ధతులపై సుప్రీం కీలక స్పందన

కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ

అన్ని విడాకుల పద్ధతులపై మార్గదర్శకాలు

ముస్లిం మహిళల హక్కుల పరిరక్షణకు చర్యలు

ఏకపక్ష విడాకులపై పిటిషన్

సమానత్వం, ఆత్మగౌరవ హక్కులపై వాదనలు

కేంద్ర చట్ట మంత్రిత్వ శాఖకు ఆదేశాలు

2 లో


రాయచోటిలో రాజకీయ రగడ!



2 లో

న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో పాటు వైసీపీ కార్యాలయం, అక్కడ ఉన్న వాహనాలకు టీడీపీ కార్యకర్తలు నిప్పు పెట్టారు.

ఏపీలో మున్సిపల్ ఎన్నికల నగారా



2 లో

నామినేషన్లకు మూడు రోజులే గడువు

3,942 స్థానాలకు ఎన్నికల పోరు

5,485 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు అవకాశం

ఈ నెల 19న నామినేషన్ల పరిశీలన

21 వరకు ఉపసంహరణకు గడువు

28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు!



న్యూస్ డెస్క్, అక్టోబర్ 16 (ఇది కద నిజం): తెలంగాణలో సాగునీటి కొరతపై రాజకీయ దుమారం రేగుతోంది. రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ఇబ్బందులకు ప్రకృతి పరిస్థితులే కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు" అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కీలక సమయంలో పంపులు ప్రారంభించకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు.

76 రోజుల ఆలస్యం.. 40 టీఎంసీల నీటిపై ప్రభావం!

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లాపూర్ పంప్‌హౌస్ వద్ద భారీ సామర్థ్యం కలిగిన పంపులను చూపిస్తూ కేటీఆర్ ఎక్స్‌లో వీడియోను పోస్ట్ చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ఈ ప్రాజెక్టులో ఒక్కో పంపు 145 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

- 76 రోజుల నిర్లక్ష్యం.. 40 టీఎంసీల నష్టం!
- కాలం కాదు.. కాంగ్రెస్ కరువు!
- పంపులు ఆన్ చేయరా.. రైతులను ముంచుతారా?
- 250 టీఎంసీల కృష్ణా జలాలు దిగువకే!
- పాలమూరు ప్రాజెక్టుపై ఎందుకీ నిర్లక్ష్యం?
- కేసీఆర్‌పై కక్షతో రైతులకు శిక్షా?
- కన్నెపల్లి, దేవాదులపై అలసత్వం!
- ఎల్‌నినో హెచ్చరికలు బేఖాతరా?
- తెలంగాణలో కరువు.. ఏపీకి నీళ్లు!

కేసీఆర్ హయాంలో నిర్మించిన ఈ ప్రాజెక్టులో ఒక్కో పంపు 145 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

మిగతాది 2 లో..

పాక్ నుంచి వచ్చారు.. భారతీయులయ్యారు!



న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): పాకిస్థాన్ నుంచి వలస వచ్చి గుజరాత్‌లో తలదాచుకున్న 319 మందికి ఎట్టకేలకు భారతీయ పౌరసత్వం లభించింది. ఏళ్ల తరబడి పడిన నిరీక్షణ ఫలించడంతో ఆ కుటుంబాలన్నీ తమ జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందని ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ లబ్ధిదారులకు పౌరసత్వ ధ్రువపత్రాలను అందజేశారు. రాజ్‌కోట్‌లోని ప్రముఖ స్వామి ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలో చాలామంది భావోద్వేగానికి గురయ్యారు. పౌరసత్వం వచ్చినట్లు ప్రకటించగానే వారి కళ్లలో ఆనందబాష్పాలు రాలాయి.

పోటీకి భయపడం.. రండి చూసుకుందాం!

మస్క్‌కు జియో స్ట్రాంగ్ కౌంటర్

స్టార్‌లింక్‌కు జియో స్వాగతం

భారత చట్టాలకు కట్టుబడాల్సిందే

పదేళ్లలో 53 కోట్లకు పైగా జియో వినియోగదారులు

చౌకైన డేటాతో డిజిటల్ విప్లవం

శాటిలైట్ రంగంలో గుత్తాధిపత్యానికి చెక్

ప్రభుత్వ అనుమతుల కోసం జియో ఎదురుచూపులు



2 లో

న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): అమెరికా కుబేరుడు ఎలోన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ 'స్టార్‌లింక్' భారత్‌లోకి ప్రవేశించడంపై గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో భారత టెలికాం మార్కెట్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్లో పోటీని ఆహ్వానిస్తున్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఇందులో స్టార్‌లింక్ కూడా భాగమేనని పేర్కొంది. అయితే, ఈ రంగంలోకి వచ్చే ప్రతి సంస్థ దేశీయ చట్టాలు, ప్రస్తుత నిబంధనలకు కట్టుబడి పనిచేయాల్సిందేనని తేల్చిచెప్పింది. భారత్‌లో స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి ఇక్కడి కొందరు వ్యాపారవేత్తలు, కార్పొరేట్ శక్తులు అడ్డుపడుతున్నాయంటూ మస్క్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 17-10-2026

తలాక్‌పై కేంద్రానికి సుప్రీం నోటీసులు!



న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): ముస్లిం సమాజంలో ప్రస్తుతం అమల్లో ఉన్న అన్ని రకాల విడాకుల పద్ధతులు, ఇతర వైవాహిక రద్దు రూపాలపై స్పష్టమైన చట్టబద్ధమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం స్పందించింది. అయితే, సదరు పిటిషన్‌పై తమ నివేదికను కౌంటర్‌లా దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం ఇవాళ నోటీసులు జారీ చేసింది.

ముస్లిం పర్సనల్ లా కింద అమల్లో ఉన్న వివిధ రకాల తలాక్ పద్ధతులు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు, ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవం, సమానత్వపు హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు తలాక్ ను ఇప్పటికే సుప్రీంకోర్టు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ నిషేధించినప్పటికీ, ఇతర రకాల ఏకపక్ష విడాకుల పద్ధతులు ఇంకా అమల్లో ఉన్నాయని, వీటిని క్రమబద్ధీకరించడానికి, నియంత్రించడానికి యునిఫాం గైడ్‌లైన్స్ అవసరమని పిటిషనర్ కోరింది. ఈ క్రమంలోనే చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం సదరు పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ, ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులను పరిరక్షించేలా, అన్ని రకాల విడాకుల ప్రక్రియలో న్యాయమైన విధానం అమలయ్యేలా గైడ్‌లైన్స్ రూపొందించే అంశంపై కేంద్ర చట్ట మంత్రిత్వ శాఖ తమ స్పందన తెలియజేయాలని నోటీసుల ద్వారా కోరింది.

ఎన్‌డీఎంసీ ఆంక్షలపై సుప్రీం హెచ్చరిక!



న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): కాక్రోచ్ జనతా పార్టీ 'తిరంగా నిరసన' నేపథ్యంలో న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కనాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌లను మూసివేయడంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. తాజా నిర్ణయం వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లినట్లు తెలిస్తే, రాజ్యాంగ పరిహార అధికారాలను ఉపయోగించి కఠిన చర్యలు తీసుకుంటామని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది.

రూ.200 కోట్ల వ్యాపార నష్టం.. వర్తకుల ఆందోళన

కనాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌ల మూసివేతపై ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ తరపున అడ్వకేట్ జై అనంత్ దేహద్రాయ్ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. దసరా పండుగ సీజన్ సమీపిస్తున్న వేళ సెంట్రల్ పార్క్‌లో నిరసనలు, ఎన్‌డీఎంసీ విధించిన ఆంక్షల వల్ల రోజుకు దాదాపు రూ.200 కోట్ల మేర వ్యాపార లావాదేవీలకు విఘాతం కలుగుతుందని, ఇది చిన్న వ్యాపారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

సుప్రీంకోర్టు ధర్మాసనం రియాక్షన్ ఇదే..

ఈ క్రమంలోనే జై అనంత్ దేహద్రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ లతో కూడిన ధర్మాసనం ఇవా విచారణ చేపట్టింది. వాదనల వేళ సీజేఐ సూర్యకాంత్ మాట్లాడుతూ.. అందరికీ సద్బుద్ధి కలుగుతుందని ఆశిస్తున్నాం. పండుగ రోజుల్లో చిన్న షాపుల యజమానులు తమ జీవనోపాధిని పొందుతారని మాకు తెలుసు. ఇలాంటి సమయంలో వ్యాపారాలకు అంతరాయం కలిగితే ఆ కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయని కామెంట్ చేశారు. ఇదే అంశంపై జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ కూడా రియాక్ట్ అయ్యారు. ఒకవేళ ఎన్‌డీఎంసీ విధించిన ఆంక్షలు దామాషాకు మించి ఉన్నాయని, వ్యాపారులకు అక్రమంగా నష్టం కలిగిందని కోర్టు భావిస్తే.. రాజ్యాంగ పరిహార నియమాల ప్రకారం నష్టపరిహారం ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దసరా సెలవుల అనంతరం కేసులో తదుపరి విచారణను అక్టోబర్ 26కు కోర్టు వాయిదా వేసింది.

రాహుల్‌పై ఆరోపణలు.. సుప్రీం కీలక వ్యాఖ్యలు!




న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): లోక్‌సభా పక్షనేత, కాంగ్రెస్ లీడర్ రాహుల్ గాంధీ పై వచ్చిన ఆరోపణల వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పందించింది. ఈ నెల 12న ఎన్నికల సంఘంపై పిటిషన్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లిన సమయంలో రాహుల్ గాంధీ తోపులాటలో పలువురిని నెట్టివేశారనే ఆరోపణలు వెలుగుచూశాయి. ముఖ్యంగా, గర్భిణిగా ఉన్న మహిళా జర్నలిస్టు రిచా పరాశరను కూడా ఆయన నెట్టివేశారంటూ బీజేపీ నేత గౌరవ్ భాటియా ప్రధానంగా సీజేఐ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

మౌఖిక ఆరోపణలు వద్దు.. పిటిషన్ దాఖలు చేయండి

అయితే, ఈ అంశంపై కోర్టులో ప్రస్తావన రాగా.. కేవలం మౌఖికంగా చెప్పే విషయాలను తాము పరిగణనలోకి తీసుకోలేమని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని సరైన వివరాలు, ఆధారాలతో అధికారికంగా పిటిషన్ దాఖలు చేస్తే, దానిపై విచారణ చేపట్టడాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

ధ్రువ్ రాఠీపై క్రిమినల్ కేసు!



న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి పరువు నష్టం కేసులో ఇబ్బందులు మరింత పెరిగాయి. గురుగ్రామ్‌లోని ఇంటి ప్రధాన గేటుపై ఢిల్లీ సాకేత్ కోర్టు సమన్లను అంటించారు. బీజేపీ ఐటీ సెల్ సభ్యుడు వికాస్ సాకృత్యాయన్ అలియాస్ వికాస్ పాండే దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసుకు సంబంధించి ఈ పరిణామం చోటుచేసుకుంది. గురుగ్రామ్‌లోని సెక్టార్-56 లో ఉన్న కేంద్రీయ విహార్ సొసైటీలో ఉన్న ధ్రువ్ రాఠీ ఇంటి గేటుపై ఈ నోటీసును అతికించారు. కోర్టు సిబ్బందితో పాటు ఫిర్యాదుదారుడు స్వయంగా వెళ్లి ఈ సమన్లను జారీ చేసేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో అధికారులు ఈ చర్య తీసుకున్నారు. రాఠీకి నేరుగా అందజేయడానికి వీలుపడకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఇంటి గేటుపైనే ఈ నోటీసును అంటించి సమాచారం అందించారు.

ఈ వివాదం మూలాలు 2018 నాటి ఓ వీడియోలో ఉన్నాయి. 'బీజేపీ ఐటీ సెల్ పార్ట్-2' పేరుతో అప్పట్లో అప్‌లోడ్ చేసిన ఆ వీడియోలో తమపై, బీజేపీ ఐటీ సెల్ పై నిరాధార ఆరోపణలు చేశారని వికాస్ పాండే ఫిర్యాదులో పేర్కొన్నారు. వికాస్ పాండే ద్వారా మహావీర్ ప్రసాద్ అనే వ్యక్తికి లంచం ఇవ్వడానికి ప్రయత్నించారని, అంతేకాకుండా ధ్రువ్ రాఠీని బద్నాం చేయడానికి రూ.50 లక్షలు ఆశ చూపారంటూ ఆ వీడియోలో తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ నిరాధార ఆరోపణలు తన వ్యక్తిగత, సామాజిక ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించాయని వికాస్ పాండే తెలిపారు. 2019 జూలైలోనే ఈ కేసుకు సంబంధించి మొదటిసారి సమన్లు జారీ అయినప్పటికీ, ఇప్పటివరకు అవి ఆయనకు అందలేదు. ధ్రువ్ రాఠీ ఆస్ట్రియాలో నివసిస్తుండటం, నోటీసులు తీసుకోవడానికి నిరాకరించడమే ఇందుకు కారణం. అయితే, ఆయన ప్రస్తుతం భారత్‌లోని ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనే ఉన్నట్లు సమాచారం అందడంతో కోర్టు తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. మరోవైపు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని సెంట్రల్ పార్క్‌లో జెండా వందన నిరసన కార్యక్రమం చర్చనీయాంశంగా మారగా, ఈ కార్యక్రమంలో ధ్రువ్ రాఠీ కూడా పాల్గొంటారనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలన్నింటి మధ్య, ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ అక్టోబర్ 17న జరగనుండటంతో అందరి దృష్టి కోర్టు తీర్పుపైనే నిలిచింది.

పెట్రోల్‌పై పెంపు.. డీజిల్‌పై తగ్గింపు!



న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): దేశీయంగా ఇంధన ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతి సుంకాన్ని భారీగా పెంచగా.. డీజిల్ ఎగుమతిపై విధిస్తున్న సుంకాన్ని భారీగా తగ్గించింది. ఈ కొత్త సవరించిన పన్నులు ఇవాళ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చినట్లుగా ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. లీటర్ పెట్రోల్‌పై ఎక్స్‌పోర్ట్ డ్యూటీని రూ.0.50 పైసల నుంచి ఏకంగా రూ.2.50కి అంటే ఐదు రెట్లు పెంచారు. ఇక లీటరు డీజిల్‌పై ఎక్స్‌పోర్టు డ్యూటీని రూ.16 నుంచి ఏకంగా రూ.8.50కి అంటే సగానికి తగ్గించారు.

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల్లో వస్తున్న హెచ్చుతగ్గులకు అనుగుణంగా ప్రతీ 15 రోజులకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను సమీక్షించి సవరిస్తుంటుంది. అంతర్జాతీయ ధరల సరళికి అనుగుణంగానే ఈ తాజా మార్పులు చేసినట్లుగా తెలుస్తోంది. అయితే, ఆయిల్ రిఫైనరీలు విదేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేయడం ద్వారా అధిక లాభాలు గడించకుండా నియంత్రించేందుకు భారత్ మొదటిసారిగా 2022 జూలైలో ఈ విండ్‌ఫాల్ పన్నులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

రాయచోటిలో రాజకీయ రగడ!


మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పరిస్థితిని అదుపుచేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఇరు వర్గాలను చెదరగొట్టారు.

రాయచోటిలోని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కార్యాలయం వద్దకు చేరుకున్న టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. కర్రలు, రాళ్లతో దాడి చేస్తూ బీభత్సం సృష్టించారు. ఈ క్రమంలో సుమారు 10 వాహనాలకు నిప్పు పెట్టారు. ఆపై వైసీపీ కార్యాలయంకు నిప్పు పెట్టారు. మంటలు భారీగా ఎగిసిపడటంతో పరిసర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. దాడి జరిగిన సమయంలో శ్రీకాంత్ రెడ్డి వైసీపీ కార్యాలయంలోనే ఉన్నారు. ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ పరిణామాలతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దాడి నేపథ్యంలో కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తోంది.

ఘటనను చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కూడా టీడీపీ శ్రేణులు దాడి చేశాయి. దాడి భయంతో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ముందుకు రావడం లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఏపీలో మున్సిపల్ ఎన్నికల నగారా



న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులతో పాటు 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు సంబంధించి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,485 కేంద్రాల్లో నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పాటు నామినేషన్లను స్వీకరించనున్నారు. అభ్యర్థులు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తమ నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చు.

నామినేషన్ పత్రాల పరిశీలన ఈ నెల 19న జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 21 వరకు అవకాశం కల్పించారు. అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు ఈ నెల 28న పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ అనంతరం ఈ నెల 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల సందడి మొదలైంది.

పాక్ నుంచి వచ్చారు.. భారతీయులయ్యారు!

మొదటి పేజీ తరువాయి

"నవ్వుకోండి, ఇకపై మీరందరూ అధికారికంగా భారతీయులే" అంటూ డిప్యూటీ సీఎం వారికి అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న కీలక నిర్ణయం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వల్లే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు.

ఈ చట్టం ద్వారా శరణార్థుల జీవితాల్లో భద్రత, ఆశలు చిగురించాయని హర్ష్ సంఘ్వీ తెలిపారు. పాకిస్థాన్‌లో హిందూ కుటుంబాలు, ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కాదన్నారు. పాక్‌లోని థార్‌పార్కర్ ప్రాంతం నుంచి భారత్‌కు వచ్చిన ఎంతోమంది మహిళలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి పేర్లు కూడా మార్చుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు భారతీయ పౌరసత్వం రావడంతో వారు ఎవరికీ భయపడకుండా తమ అసలు పేర్లతో ఆత్మగౌరవంతో బతకవచ్చని చెప్పారు. పౌరసత్వం పొందిన 319 మందిలో రాజ్‌కోట్ జిల్లాకు చెందిన వారు 259 మంది ఉండగా, మోర్బీ నుంచి 53 మంది, కచ్ నుంచి 6 మంది, సురేంద్రనగర్ నుంచి ఒకరు ఉన్నారు. పాకిస్థాన్ పాస్‌పోర్ట్ కంటే.. రాజ్‌కోట్ గర్బా ఉత్సవాల్లో పాల్గొనేందుకు లభించే అనుమతి పత్రమే తనకు ఎంతో విలువైనదని ఈ సందర్భంగా హర్ష్ సంఘ్వీ వ్యాఖ్యానించారు. దేశంలో స్థిరమైన గుర్తింపు, రక్షణ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ కుటుంబాలకు ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనది. పౌరసత్వం దక్కడంపై వారు స్పందిస్తూ.. ఇది తమ కల నిజమైన క్షణమని చెప్పారు. ఇకపై తమకంటూ ఆధార్ కార్డు, ఓటరు ఐడీ వస్తాయని, రాబోయే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఇల్లు కొనుగోలు చేయడానికి బ్యాంకుల్లో రుణాలు కూడా పొందవచ్చని సంతోషంగా తెలిపారు.

ఖైరతాబాద్ బరిలో కవిత అభ్యర్థి!

న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనబెట్టి కేవలం రాజకీయాలకే పరిమితమయ్యారని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాబోయే రోజుల్లో వరుసగా 7 నుంచి 8 నెలల పాటు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని కవిత స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన క్షేత్రస్థాయిలో పోరాడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఒప్పందాల్లో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీలే ఎక్కువగా ఉన్నాయని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం నిర్వహించే 'గ్లోబల్ సమ్మిట్'ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

మేడిగడ్డను పూర్తి చేయాలి..

సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించిన కవిత, మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖైరతాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన తరపున అత్యంత బలమైన అభ్యర్థిని బరిలోకి దించుతామని, దసరా పండుగ రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘం కి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న నిరసనలన్నీ డ్రామా అని, అవన్నీ కేవలం "ఫేక్ నిరసనలు" అని కవిత కొట్టిపారేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత పెరగాలంటే రాబోయే ఎన్నికలన్నీ ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్ ద్వారానే నిర్వహించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు.

పోటీకి భయపడం.. రండి చూసుకుందాం!

మొదటి పేజీ తరువాయి

అలాగే ముకేశ్ అంబానీని ఉద్దేశిస్తూ భారత టెలికాం రంగంలో పోటీ తత్వంపై ప్రశ్నలు గుప్పించారు. మస్క్ ఆరోపణల నేపథ్యంలో రిలయన్స్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. "మేము ఎప్పుడూ పోటీకి భయపడలేదు. వినియోగదారులకు ఎవరు అత్యుత్తమ సేవలను అందిస్తున్నారో నిరూపించుకోవడానికి పోటీనే అతిపెద్ద పరీక్షగా మేము భావిస్తాం" అని తెలిపింది.

తన టెలికాం విభాగమైన 'జియో ప్లాట్‌ఫార్మ్స్' ప్రయాణాన్ని రిలయన్స్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. 2016లో జియో సేవలు ప్రారంభించినప్పుడు తమకు ఒక్క కస్టమర్ కూడా లేరని, కానీ కేవలం పదేళ్ల కాలంలో జియో వినియోగదారుల సంఖ్య 53 కోట్లకు పైగా పెరిగిందని వెల్లడించింది. భారతీయ పౌరులకు మెరుగైన డిజిటల్ సేవలతో పాటు ప్రపంచంలోనే అత్యంత చవకైన మొబైల్ డేటాను అందుబాటులోకి తీసుకురావడంలో జియో కీలక పాత్ర పోషించిందని కంపెనీ పేర్కొంది. స్టార్‌లింక్‌తో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలోకి వచ్చే అన్ని కంపెనీలను తాము ఆహ్వానిస్తున్నామని చెప్పిన రిలయన్స్.. జియోతో సహా ప్రతి ఒక్కరూ భారతీయుల ప్రయోజనాల కోసం, దేశ చట్టాలు, విధానాలకు లోబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. భారత్‌లో స్వదేశీ, విదేశీ పెట్టుబడులకు, కొత్త ప్రయోగాలకు ఎప్పుడూ స్వాగతం ఉంటుందని, అయితే ఇదంతా చట్ట పరిధిలోనే జరగాలని వివరించింది.

మరోవైపు, శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి కంపెనీకి ఒకే రకమైన నిబంధనలు, ప్రక్రియలు వర్తిస్తాయని భారత ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. తమ సొంత శాటిలైట్ నెట్‌వర్క్ సేవలకు సంబంధించి జియో కూడా ప్రస్తుతం ప్రభుత్వ అనుమతుల కోసమే వేచి చూస్తోందని రిలయన్స్ ఈ సందర్భంగా వెల్లడించింది. భారత్‌లో స్టార్‌లింక్ సేవలు ప్రారంభించడానికి సన్నాహాలు చేసుకుంటున్న వేళ రిలయన్స్ చేసిన ఈ ప్రకటన టెలికాం వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో ఏ ఒక్కరి గుత్తాధిపత్యానికి తావులేదని ప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే.

డీలిమిటేషన్‌పై కేంద్రం ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు ఆ పరిణామం జరిగిన కొన్ని నెలల తర్వాత ప్రభుత్వం మళ్లీ ఈ దిశగా అడుగులు వేస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గాలంటే పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ (స్పెషల్ మెజారిటీ) తప్పనిసరి. ప్రస్తుత లోక్‌సభలో ఎన్డీయే కూటమికి సాధారణ మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు కావాల్సిన మూడింట రెండు వంతుల మెజారిటీకి కొన్ని సీట్లు తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో 540 మంది సభ్యులు ఉండగా, బిల్లు ఆమోదానికి దాదాపు 360 సీట్ల మద్దతు అవసరం. అయితే గత సమావేశాలతో పోలిస్తే ఇప్పుడు ప్రభుత్వ బలం కొంత పెరిగింది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యుబిటి)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపునకు మారడంతో ప్రభుత్వ స్థానం మరింత బలపడింది.

ఈ బిల్లులకు మద్దతు పొందడం కోసం కేంద్ర ప్రభుత్వం ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎమ్‌కె)తో కూడా చర్చలు జరుపుతోందని సమాచారం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో విభేదించి, 'ఇండియా' కూటమి నుంచి డిఎమ్‌కె బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతీయ పార్టీ మద్దతును కూడగట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. ఓటింగ్ నాటికి తమ వైపు సంఖ్యను మరింత పెంచుకునేందుకు కొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతో కూడా ప్రభుత్వం టచ్‌లో ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఇప్పటివరకు అధికారికంగా ప్రొరోగ్ (రద్దు) కాకపోవడం గమనార్హం. దీనివల్ల ప్రత్యేక సమావేశాలను తక్షణమే ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి సులువుగా మార్గం సుగమమైంది. ఇక, ఈ నెల 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో 12వ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా (బ్రిక్స్) పార్లమెంటరీ ఫోరమ్ జరగాల్సి ఉంది. ఈ సమావేశాల తేదీలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తేదీలను ఆఖరిగా ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ ప్రత్యేక సమావేశాలను ప్రారంభించడానికి ముందు కనీసం ఒక వారం రోజుల ముందే నోటీసు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు!

మొదటి పేజీ తరువాయి

శ్రీశైలం జలాశయానికి జూలై 29 నుంచి వరద ప్రవాహాలు ప్రారంభమైనప్పటికీ, రేవంత్ ప్రభుత్వం సుమారు 76 రోజుల పాటు పంపులను ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు డిమాండ్ చేసిన తర్వాతే పంపింగ్ ప్రారంభించారని విమర్శించారు.

వరదలు వచ్చినప్పటి నుంచే పంపింగ్ చేపట్టి ఉంటే సుమారు 40 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ నీటితో దాదాపు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వీలుండేదని తెలిపారు. అయితే, కేసీఆర్‌కు రాజకీయంగా పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ప్రాజెక్టును సకాలంలో వినియోగించలేదని ఆయన ఆరోపించారు. ఈ జాప్యం వల్లే రైతులు ప్రస్తుతం సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

దిగువకు వందల టీఎంసీల నీరు.. కేటీఆర్ ఆరోపణలు

2026 జూన్ 1 నుంచి ఇప్పటివరకు గోదావరి నుంచి 50 టీఎంసీలకు పైగా, కృష్ణా నది నుంచి 250 టీఎంసీల నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం దిగువకు విడిచిపెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. ఈ నీటిని రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలున్నప్పటికీ ప్రభుత్వం సరైన ప్రణాళికతో వ్యవహరించలేదని విమర్శించారు. కీలకమైన సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను సమర్థంగా వినియోగించి ఉంటే రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులను నింపడంతో పాటు రైతులకు నీటిని అందించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

కన్నెపల్లి, దేవాదులపై నిర్లక్ష్యమా?

గోదావరి జలాలను వినియోగించుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించి ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులను నింపే అవకాశం ఉండేదని అన్నారు. మరోవైపు, పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) పంపులను సకాలంలో ప్రారంభించకపోవడంతో కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకోలేకపోయారని ఆరోపించారు. నీటి లభ్యత ఉన్న సమయంలోనే సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ దిశగా వ్యవహరించలేదని మండిపడ్డారు.

ఎల్‌నినో హెచ్చరికలను పట్టించుకోలేదా?

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, వ్యవసాయ పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యత, వర్షాల పరిస్థితులు, సాగు అవసరాలను సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టులను నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి జలవనరుల వినియోగంపై ప్రణాళిక రూపొందించి ఉంటే రైతులకు కొంత ఉపశమనం కలిగేదని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ నీళ్లు ఏపీకి.. కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తన అవసరాలకు వినియోగించుకుందని కేటీఆర్ ఆరోపించారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను, పోతిరెడ్డిపాడు, వెలిగొండ టన్నెల్ మార్గాల ద్వారా కృష్ణా జలాలను తరలించుకెళ్లిందని పేర్కొన్నారు. క

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 17-10-2026

గౌరారంలో అంబరాన్నంటిన అట్ల బతుకమ్మ సంబరాలు!

- అడవి పూలతో అందంగా బతుకమ్మల పేర్పు
- సంప్రదాయ దుస్తుల్లో మహిళల ఆటపాటలు






ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామంలో అట్ల బతుకమ్మ పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలతో గ్రామంలో పండుగ శోభ సంతరించుకుంది. ప్రకృతిలో లభించే వివిధ రకాల రంగురంగుల అడవి పుష్పాలను సేకరించి, వాటిని అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, బతుకమ్మలను మధ్యలో ఉంచి చుట్టూ చేరి పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. భాజాభజంత్రీల మోతలు, మహిళల బతుకమ్మ పాటలు, ఆటపాటలతో గ్రామమంతా సందడిగా మారింది. పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తరతరాలుగా వస్తున్న తెలంగాణ పూల పండుగ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ప్రకృతితో మమేకమై, పూల అందాలను ఆరాధిస్తూ నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో ఐకమత్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు, వార్డు సభ్యుడు కుమ్మరి రాజు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జూపాల శంకర్, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేంద్ర చౌరస్తా వద్ద గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

- షాపింగ్ నిమిత్తం భార్యతో కలిసి బైక్‌పై వెళ్తుండగా విషాదం
- స్థానికుల సీపీఆర్ ప్రయత్నాలు విఫలం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కత్తి నడిపి గంగారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. భార్యతో కలిసి షాపింగ్ నిమిత్తం బైక్‌పై గోవూర్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా రాజరాజేంద్ర చౌరస్తా వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. నిజామాబాద్ టూ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగారం, ప్రయాణంలో ఉండగా హఠాత్తుగా గుండెపోటుకు గురై బైక్‌పై నుంచి కిందపడిపోయారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆయనకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో గంగారం మృతి చెందారు. కళ్లముందే భర్త కుప్పకూలి మృతి చెందడంతో ఆయన భార్య తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గోవూర్ గ్రామానికి చెందిన గంగారం ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయన అకాల మరణం గ్రామంలో విషాదాన్ని నింపింది.

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా శుక్రవారం కంబాపూర్ గ్రామంలో ఇళ్ల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయన్న గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను పరిశీలించి, ఇళ్ల స్థితిగతులను వెరిఫికేషన్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా పరిశీలన ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్, ఉప సర్పంచ్ ఎర్ర అంజావా, పంచాయతీ కార్యదర్శి ఇంద్రమ్మతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, లబ్ధిదారుల వివరాల పరిశీలనలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కాకినాడలో అగ్నిప్రమాదం....

- తాళాలు వేసి ఉన్న ఇంట్లో చెలరేగిన మంటలు.
- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం.
- సకాలంలో మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది...



కాకినాడ (ఇది కద నిజం) అక్టోబర్ 16: భానుగుడి టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రకాష్ వీధిలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ ప్రమాదంలో వాషింగ్ మిషన్ పూర్తిగా దగ్ధమైంది. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

ఏలూరు జిల్లాలో ఎక్సైజ్ శాఖ ముమ్మర తనిఖీలు

పలువురిపై బైండోవర్ కేసులు నమోదు



ఇది కద నిజం:ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ శ్రీమతి బి. శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ కె.వి.ఎన్. ప్రభు కుమార్ మరియు జిల్లా ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ అధికారి ఏ. ఆవులయ్య ఆదేశాల మేరకు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాణావతు వెంకటేశ్వరరావు బెల్ట్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి. అశోక్ తెలిపారు. అదేవిధంగా, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖలతో ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ సమావేశానికి అధికారులు హాజరై సబ్ కలెక్టర్ నుంచి తగిన ఆదేశాలు, సూచనలు స్వీకరించారు. మరోవైపు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చింతలపూడి మండలానికి చెందిన తోట ఏసుబాబు, తాత రాంబాబు, తాత నాగమణి అనే ముగ్గురు వ్యక్తులను చింతలపూడి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, వారు 129 బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం బైండోవర్ బాండ్ విధించారు. అంతేకాకుండా, లింగపాలెం మండలంలోని పలు మద్యం దుకాణాలలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి, ఏపీఎస్బీసీఎల్ డిపోల నుండి వచ్చిన మద్యం సీసాలపై ఉన్న హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్‌లను 'ఏపీ సురక్ష' ఆన్‌లైన్ యాప్ ద్వారా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని, పూర్తి చట్టపరమైన నియమ నిబంధనలను పాటిస్తూ విక్రయాలు జరపాలని దుకాణాల సేల్స్ సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలలో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది జె. జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం మండల ఎన్నికలపై ఎమ్మెల్యే రోషన్ కుమార్ దిశానిర్దేశం

పదవులు ఆశించిన ఆశావాహులకు కీలక సూచన



ఇది కద నిజం,జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలైన ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో సూర్య ఫంక్షన్ హాల్ లో మండల పార్టీ అధ్యక్షుడు కుక్కల మాధవరావు అధ్యక్షతన మండల నాయకులతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఏలూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి, చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రావి వెంకటేశ్వరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ "రాబోయే మండల ఎన్నికలు మనకు చాలా కీలకం. మండలంలోని గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్, ఇతర పదవులను ఆశిస్తున్న ఆశావాహులు ఎవరూ అధైర్యపడవద్దు. ప్రభుత్వం నుండి, అధిష్టానం నుండి అధికారిక నిర్ణయం వచ్చే వరకు అందరూ సంయమనం పాటించాలి. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, పదవులు తప్పకుండా వస్తాయి" అని భరోసా ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ "మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతం కావాలి. ఎన్నికల సమయంలో అందరూ ఐక్యంగా ఉండి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలి. అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం" అని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు రావి వెంకటేశ్వరావు మాట్లాడుతూబి "పదవులు ఆశించిన ఆశావాహుల వివరాలు సేకరించి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం. టికెట్ ఎవరికి వచ్చినా అందరూ కలిసికట్టుగా పని చేయాలి" అని సూచించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ. "కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి. ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ ఏఆర్ దేవరాజ్ భవన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



ఇది కద నిజం ,రాజేంద్రనగర్ : భారత కమ్యూనిస్టు పార్టీ, భారత జాతీయ మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల సమితి ఆధ్వర్యంలో అక్టోబర్ 15, 2026 గురువారం సాయంత్రం 6:00 గంటలకు స్థానిక సీపీఐ మండల కార్యాలయం 'ఏఆర్ దేవరాజ్ భవన్' వద్ద బతుకమ్మ పండుగ ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ముఖ్య అతిథిగా విచ్చేసి సందడి చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కౌన్సిల్ సభ్యులు జె. ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె. విజయ ఆనంద్ గౌడ్, మండల బీసీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సదానంద్ గౌడ్, మనోజ్, అలాగే భారత జాతీయ మహిళా సమాఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు కన్యగారి లక్ష్మి, మునేశ్వరి, మండల కార్యాలయం కార్యదర్శి జి. సత్యం, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సలీం, సయ్యద్ కాజా తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు మండలంలోని వివిధ శాఖల కార్యదర్శులు పాండు, శ్రీరాములు, సాబీర్, సరూప, వాణి, హుస్సేన్ భాయ్, శాంతమ్మ, శ్రీను, జంగయ్య, మౌనిక, జ్యోతి, శాలిని, మధు, సునీత, సుజాత తదితరులు మరియు మండలంలోని పార్టీ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మండల ప్రధాన కార్యదర్శి కన్యగారి లక్ష్మి తెలిపారు.

యువత సమస్యల పరిష్కార రథంగా 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'

హైదరాబాదులో ప్రారంభించిన పవన్ కళ్యాణ్




ఇది కద నిజం:వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన పార్టీ రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ ఈ వాహనాన్ని సిద్ధం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షుడు నెమురి శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఈ గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ కేవలం ఒక ఎన్నికల ప్రచార వాహనంగా మాత్రమే పరిమితం కాదని, పట్టభద్రులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం మరియు ప్రచార రథం ప్రారంభం గురించి జిల్లేడు చౌదరిగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు భూమగళ్ళ రామకృష్ణ వివరాలు వెల్లడిస్తూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి విజయం కోసం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.

పిట్లంలో అంగరంగ వైభవంగా అట్ల బతుకమ్మ సంబరాలు




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని గడిముందు హనుమాన్ మందిరం ఎదుట మహిళలు అట్ల బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, ఆటపాటలతో సంప్రదాయబద్ధంగా పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. చెరువు కట్ట వెంబడి లైటింగ్ సౌకర్యాలు కల్పించి, వేడుకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాంరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడలో దుర్గమ్మ తల్లిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్




ఇది కద నిజం న్యూస్
మహబూబాబాద్ జిల్లా.

మరిపెడ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ దుర్గమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు,ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,మండల అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్,టౌన్ అధ్యక్షులు రామ్ లాల్,గుండగాని వేణు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 17-10-2026

కరువుపై ముందస్తు చర్యలు చేపట్టటంలో ముఖ్యమంత్రి అట్టర్ ఫ్లాప్

ప్రెస్ మీట్ పెట్టి తాను ఏం చేయలేనని చేతులెత్తేశారు
రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతోనే ఈ దుస్థితి
రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇవ్వడంతో పాటు ఇన్సూరెన్స్ చేయించాలి
రాష్ట్రం కరువులో ఉంటే సీఎం యాదాద్రి పవర్ ప్లాంట్ ను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తున్నడు
పవర్ మ్యాక్స్ కంపెనీతో ఉన్న ఒప్పందం ఏమిటో బయట పెట్టాలి
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం ,హైదరాబాద్ : కరువు వస్తుందనే ముందే హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టడంలో సీఎం రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచే ఎల్ నినో ఎఫెక్ట్ తో తీవ్రమైన కరువు వచ్చే ప్రమాదముందని హెచ్చరించినా కనీస చర్యలు చేపట్టలేదన్నారు. దొంగలు పడిన ఆరు నెలలకు అన్నట్లుగా ఇప్పుడొచ్చి రైతులు త్యాగాలు చేయాలని నీతులు వల్లించడం సిగ్గుచేటు అన్నారు. కరువు విషయంలో తాను ఏమీ చేయలేనని సీఎం రేవంత్ రెడ్డి నిస్సహాయతను వ్యక్తం చేస్తూ చేతులెత్తేశారని మండిపడ్డారు. పాలకుడికి దూరదృష్టి ఉండాలని.. సీఎంలో అది లోపించిందని అన్నారు. పరిస్థితి మొత్తం చేయి దాటి పోయిన తర్వాత వచ్చి రైతులు త్యాగాలు చేయాలని మాట్లాడటం దారుణమన్నారు. ఆగస్టు నెలలో 28 శాతం లోటు వర్షపాతం నమోదు అయ్యిందని.. అప్పుడే అలర్ట్ అయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి కేంద్రానికే ఇప్పటికే నివేదిక పంపాయని గుర్తు చేశారు. మన సీఎం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు నింపాదిగా రివ్యూలు అంటూ కాలం వెళ్లదీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం, ముఖ్యమంత్రి ముందే మేల్కొని ముందస్తుగా చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తప్పేవన్నారు. మన ముఖ్యమంత్రికి ప్రజల మీద శ్రద్ధ, సమస్యల మీద ఫోకస్ లేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు అవుతుందని.. ఇప్పటి వరకు పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేయలేదని, మేడిగడ్డ బ్యారేజ్ ను కూడా రిపేర్ చేయలేదని అన్నారు. వాటిని పూర్తి చేసి ఉంటే ఇవ్వాళ రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 26 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీళ్లు ఇవ్వలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ రిపేర్లు చేసుకోవడానికి ఇదే సరైన సమయమని.. వచ్చే వర్షాకాలంలోగా ఆ పనులు పూర్తి గోదావరి నీళ్లను వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇంకా ఎన్నాళ్లు గత ప్రభుత్వాన్ని తిడుతూ టైమ్ చేస్తారని ప్రశ్నించారు. తిట్టుడు బంద్ చేసి కట్టుడు షురూ చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఏడాదికి కృష్ణా నీళ్ల ఒప్పందం కుదుర్చుకుంటే ఆ వంకతో తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీసే విధంగా ఏపీకి కృష్ణా నీటి ధారాదత్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు బిడ్డ అయి ఉండి కనీసం భీమా, నెట్టంపాడు ప్రాజెక్ట్ లను కూడా పూర్తి చేయకపోవటం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ తప్పులను ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అవే తప్పులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి శాపంగా సీఎం అనుభవ లేమి

సీఎం రేవంత్ రెడ్డి అనుభవలేమి రాష్ట్రానికి శాపంగా మారిందని మండిపడ్డారు. నీళ్ల విషయంలో, కరువును ఎదుర్కొనే విషయంలో సీఎం ఏమాత్రం ముందు చూపుతో వ్యవహరించలేదన్నారు. రైతులను త్యాగాలు చేయాలంటున్న ముఖ్యమంత్రి వారికి పరిహారం ఏం ఇస్తారో మాత్రం చెప్పడం లేదన్నారు. పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని లీకులు ఇస్తున్నారే తప్ప ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయడం లేదన్నారు. యాసంగిలో పంటలు సాగు చేయకపోతే రైతు కూలీలు ఆగమయ్యే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలే కాదు, రైతులు సైతం పనులు లేక పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఉందని.. పట్టణాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేవన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వడంతో పాటు వారి కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఏమైనా అయితే వారి కుటుంబాలకు ఆగమావుతాయని అన్నారు. స్థానికంగా ఉపాధి లేక జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలానికి చెందిన 20 మంది కూలీలు పనికోసం కర్ణాటకకు వెళ్తుండగా ప్రమాదం జరిగి ఇద్దరు చనిపోయారని చెప్పారు. వారి కుటుంబాలకు ఆధారం లేకుండా పోయిందన్నారు. ఉపాధి హామీ పథకంలో రైతు కూలీలకు పని కల్పిస్తామని చెప్తున్నప్పటికీ కేంద్రంతో మాట్లాడకుండా అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఉపాధి హామీలో పని దినాలు పెంచడం కోసం ఇప్పుడు కమిటీ వేస్తే ఎప్పుడు కేంద్రానికి నివేదిక ఇస్తారని.. వాళ్లు ఎప్పుడు ఆమోదిస్తారని ప్రశ్నించారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కుట్ర

రాష్ట్రం ఇంత సంక్షోభం ఉంటే సీఎం తన కుటుంబానికి సంపదను దోచేపెట్టే పనిలో ఉన్నారని కవిత మండిపడ్డారు. యాదాద్రి పవర్ ప్లాంట్ లో కొన్ని కాంపొనెంట్లను ప్రైవేటీకరించి దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పవర్ మ్యాక్స్ అనే కంపెనీతో ముఖ్యమంత్రికి ఉన్న సంబంధాన్ని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కరెంట్ విషయంలో ప్రభుత్వానికి అధికారం ఉండాలని గతంలో మాట్లాడిన సీఎం.. ఇప్పుడు ప్రైవేటీకరణకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు నీళ్లు, కరెంట్ ఇవ్వగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని.. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. రాష్ట్రంలో కరెంట్ సంక్షోభం ఉంటుందని ముందే గ్రహించి తాము ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నామని గుర్తు చేశారు. సర్ ప్లస్ కరెంట్ ఉన్న రాష్ట్రాలతో ముందే ఒప్పందం కుదుర్చుకొని ఉంటే కరెంట్ సమస్య వచ్చేది కాదన్నారు. అదుక్కుంటారో, కొనుక్కుంటారో గానీ నవంబర్ నెలాఖరు వరకు రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. లేదంటే బోర్లపై ఆధారపడిన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కరెంట్ కష్టాలను అధిగమించేందుకు అవసరమైతే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కలుస్తామని.. ఢిల్లీకి వెళ్లి కేంద్రం పెద్దలతో మాట్లాడతామని చెప్పారు.

హైదరాబాద్ నీటి కష్టాలకు కాంగ్రెస్సే కారణం

హైదరాబాద్ లో నీటి కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని కవిత చెప్పారు. ఎల్ నినో ఎఫెక్ట్ తో పాటు నగరంలో పెద్ద ఎత్తున చెరువులు కబ్జా చేయటంతో నీళ్ల కష్టాలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8 వేల చెరువులు మాయం చేశారని చెప్పారు. దీంతో నగరంలో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. చెరువులను కాపాడాల్సిన హైడ్రా ఏం చేస్తుందని నిలదీశారు. కరువు బారిన పడిన రాష్ట్రాన్ని వదిలేసి తన కుటుంబానికి దోచి పెట్టేందుకు ముఖ్యమంత్రి రోజు అన్నదమ్ములతో మీటింగ్ పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ దోపిడీకి కేటాయించిన సమయంలో కొంత రాష్ట్ర ప్రజల కోసం కేటాయించి ఉంటే ఈ కష్టాలు వచ్చేవి కావన్నారు.

అఖిలపక్షం ఇప్పుడు గుర్తొచ్చిందా?

కరువును ఎదుర్కొనే విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని కవిత అన్నారు. కరువు విషయంలో అఖిలపక్ష మీటింగ్ పెడతామని అంటున్నారని కానీ దానితో ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఈ పని ముందే చేయాల్సిందని అన్నారు. బీసీ బిల్లు విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకెళ్లలేదని నిలదీశారు. అవసరమైన విషయాల్లో సైలెంట్ గా ఉండి ఇప్పుడు తాను చేసిన తప్పుకు అందరినీ భాగస్వాములు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడు అఖిలపక్షం గుర్తొచ్చిందా అంటూ మండిపడ్డారు. కవులు, కళాకారులు, ప్రతిపక్షాలు, సినిమా స్టార్లను కరువు విషయంలో ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరుతున్నారని.. కానీ గతంలో వారిని ఇబ్బంది పెట్టిన సంగతి ఏమిటని ప్రశ్నించారు. కష్ట కాలంలో రైతులకు తాము అండగా ఉంటామని, వారికి తమ తరఫున చేయగలిగిన సాయం చేస్తారని చెప్పారు. అదే సమయంలో ఈ ప్రభుత్వం చేతగాని తనం కారణంగా వచ్చిన కరువు ముప్పును కూడా ప్రజలకు వివరిస్తామన్నారు.

సొంత మనుషులపై ఉడుకు నీళ్లు పోసే నైజం కేటీఆర్ ది

విదేశీ బొగ్గు కొనుగోలు ఒప్పందాలపై విచారణ పేరుతో ప్రతిమ శ్రీనివాస్ రావు కు వ్యతిరేకంగా కేటీఆర్ లేఖ రాయడంపై కవిత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉద్యమకాలంలో బీఆర్ఎస్ కు పూర్తి అండగా ఉన్న శ్రీనివాస్ రావుపై విచారణ కోరడం అంటే నమ్మినోళ్లను నట్టేట ముంచడమేనన్నారు. సాయం చేసిన వాళ్లను, కుల బంధువులను ఇబ్బంది పెట్టడం.. ఇంటి మనిషినైనా తనను కిరాయి మనుషులతో తిట్టించే నైజం కేటీఆర్ ది అని మండిపడ్డారు. తెలిసి చేశాడో తెలియక చేశాడో గానీ లేఖ రాయడం ఆయన అజ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. తెలియక చేసి ఉంటే ఆయనకు ఏమీ తెలియదని తాను చెప్పే మాటలు నిజమని.. తెలిసి చేసి ఉంటే అదే కేటీఆర్ నైజమని అన్నారు. సొంత మనుషులపై ఉడుకు నీళ్లు పోసే వ్యక్తి కేటీఆర్ అన్నారు. ప్రతిమ శ్రీనివాస్ ను సీఎం ఎందుకు కాపాడుతున్నాడని ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎవరినైనా శిక్షించాలని కానీ సాయం చేసిన వాళ్లపైనే విచారణ కోరుతూ లేఖలు రాయడమే కేటీఆర్ వ్యక్తిత్వమన్నారు. సింగరేణి కార్మికుల కష్టాలేవి కేటీఆర్ కు తెలియదన్నారు. సింగరేణిలో బీఆర్ఎస్ సభ పెట్టి బల ప్రదర్శన చేయడానికి ప్రయత్నించారు తప్ప కార్మికుల కష్టాలను కనీసం ప్రస్తావించలేదన్నారు. తమ పోరాటాలతోనే ప్రభుత్వం దిగి వచ్చి సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహిస్తుందని గుర్తు చేశారు. కార్మికుల కోసం పనిచేస్తున్న హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ కూటమే సింగరేణి ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆదివాసీ చట్టాల పటిష్ట అమలుకు న్యాయ కళాశాలే మార్గం!

- భద్రాచలంలో గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని నిరుపేద ఆదివాసీలకు పంపిణీ చేయాలి
- జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర



ఇది కద నిజం వాజేడు, అక్టోబర్ 16:

భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాలను ఏర్పాటు చేస్తేనే ఆదివాసీ చట్టాల అమలుకు మరింత బలం చేకూరుతుందని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర అన్నారు. శుక్రవారం వాజేడు మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయడానికి ఆదివాసీ యువతకు న్యాయ విద్య అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన అనేకమంది ఆదివాసీ యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు వారికి ఉపాధి అవకాశాలతో పాటు ఆదివాసీ హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వాజేడు మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు వలస గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్నాయని ఆరోపిస్తూ, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేద ఆదివాసీలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం అమలుకు అడ్డంకులు తొలగించి ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. భద్రాచలంలో గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటును కోరుతూ జీఎస్పీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆదివాసీ యువత మద్దతు ప్రకటించాలని పూనెం సాయి దొర పిలుపునిచ్చారు. న్యాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని భద్రాచలం ఎమ్మెల్యేను కోరారు.

ఏటూరునాగారం కాంగ్రెస్‌లో నూతనోత్సాహం.. జంబో కమిటీ ప్రకటన!

- పూర్తిస్థాయి కమిటీని ప్రకటించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీ ఏర్పాటు

ఇది కద నిజం ములుగు, అక్టోబర్ 16:

ఏటూరునాగారం మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ శుక్రవారం మండల పార్టీ పూర్తి స్థాయి జంబో కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా దేవులపల్లి విజయ్ కుమార్‌ను నియమిస్తూ, వివిధ హోదాల్లో నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యక్షులుగా వాసం రాంబాబు, తూర్పాటి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా సరికొప్పుల శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా చేలా వినయ్, డొంగిరి మధుబాబు, కోశాధికారిగా కురపాటి వేణు, అధికార ప్రతినిధిగా గంపల శివ నియమితులయ్యారు. సహాయ కార్యదర్శులు, ప్రచార కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులతో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.



చుంచుపల్లి పీహెచ్‌సీలో ఐటీడీఏ పీఓ తనిఖీలు

- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వైద్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి: పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

ఇది కద నిజం మంగపేట, అక్టోబర్ 16:



ములుగు జిల్లా మంగపేట మండలం చుంచుపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని వైద్య సేవలు, పారిశుద్ధ్య పరిస్థితులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, వ్యాక్సిన్ల నిల్వ కోసం ఏర్పాటు చేసిన శీతలీకరణ పరికరాన్ని పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నూతన ఎస్సై సృజన్ కుమార్‌కు బీజేపీ నాయకుల స్వాగతం

పాలకుర్తి, అక్టోబర్ 16 (ఇది కద నిజం)

జనగామ జిల్లా పాలకుర్తి మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఊర సృజన్ కుమార్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సృజన్ కుమార్‌కు శాలువా కప్పి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు దొంగరి మహేందర్, మండల అధ్యక్షుడు మారం రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.